# మినీకథలు

పేరుకు ప్రొడక్షన్ మేనేజరునయినా ఇంత పెద్ద కెమికల్ ప్లాంటులో మెకానికల్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంటులు రెండూ కూడా చూసుకోవడం నాకు తలకు మించిన భారంగానే ఉంది. ఉత్పత్తి మొదలై ఏడాది కావస్తున్నా అతిముఖ్యమైన ఆ రెండు డిపార్టుమెంటులను తలకాయలు లేకుండా ఉంచడంలో మా చైర్మన్‌గారి ఉద్దేశం ఏమిటో నాకు బొత్తిగా అర్థం కావటంలేదు. బహుశా ఉత్పత్తి ఎక్కడా తగ్గకపోవడం వల్ల ఆయనంత నిర్లక్ష్యంగా ఉన్నారా అని అప్పుడప్పుడు అనుమానం వస్తుంది కూడా. ప్రతి రెండు నెలలకోసారి పేపర్లలో ప్రకటించడం, మా చైర్మన్‌గారు "సూర్యా! ఈసారి మంచివాళ్ళు దరఖాస్తులు పంపారోయ్!" అనడం. చివరకు ఇంకా మంచివాళ్ళు వస్తారేమో అని నాన్చడం. ఒకవేళ ఎవరైనా నచ్చిన వాళ్ళు ఉన్నా వాళ్ళ జీతాలు నచ్చకో, వేరే కారణాల వల్లనో చేరకపోవడం ఇలా జరిగిపోతున్నాయి. రోజులు. ఇంత ఆలస్యంగా మేనేజర్లను చేర్చుకోవడంవల్ల చాలా నష్టాలు ఉంటాయి అని మా పెద్దాయనకు తెలియదా! ఆ వచ్చినవాడు కడు సమర్థుడు కాకపోతే మొదటి నుంచీ ఉన్న ఇంజనీర్లు "నీకేం తెలుసోయ్ చవటాయ్! నిన్నకాక మొన్న చేరావ్?!" అని ఎదురు తిరిగితే ఇంతవరకూ ప్రశాంతంగా ఉన్న వాతావరణం పాడయిపోదూ! ఉత్పత్తి తగ్గిపోదూ! ఎంతో తెలివయిన వాడులా కనిపించే మా పెద్దాయన మేనేజర్లను ఉత్పత్తి ప్రారంభం కాని ముందర నుంచే చేర్చుకుంటే మంచిదన్న ప్రాథమిక సూత్రం ఎందుకు పాటించలేదూ! ఇలో నాలో నేనే తర్జన భర్జన చేసుకుంటాను కానీ ఆయనను అడిగే ధైర్యం మాత్రం లేదు. ఆ కొత్తవాళ్ళు ఎంత తొందరగా తగలడితే అంత మంచిది అని నేను రోజుకోసారి అనుకోడానికి ఇంకో ముఖ్యకారణం ఉంది. తెలిసో, తెలియకో మిగతా డిపార్టుమెంటుల పనులన్నీ నేనే చూసుకుంటున్నాను. అందరు ఇంజనీర్లూ నా క్రిందే ఉన్నట్లు లెక్క. బాధ్యత ఉన్నా అధికారం ఉంది. ఈ అధికారానికి అలవాటుపడ్డ నేను క్రొత్త మేనేజర్లు వచ్చి కొంత అధికారం లాక్కుంటే తట్టుకోలేనేమో అనే భయం పట్టుకుంది నన్ను. అధికార దాహం అటువంటిది. ఆ డిపార్టుమెంటులు ఎటూ నా క్రింద ఉండేవి కావు. వాళ్ళు తొందరగా చేరితే నాకు మనశ్శాంతి ఉంటుంది కదా! నా బాధ అంతా మా పెద్దాయనముందు వెళ్ళగక్కుకోలేక ఎప్పటిలాగానే మా ఆవిడ్ణే దారి చూపించమన్నాను.

మా చైర్మన్ గారింట్లో మాకు బాగానే అలవాటు. ఇద్దరిళ్ళ మధ్య రాకపోకలు బాగానే ఉన్నాయి. మా ఆవిడకి ఆవిడదగ్గర బాగా చనువు కూడాను! ఓసారి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు మాటల సందర్భంలో ఆవిడ




మా ఆవిడతో, "మా పెద్దబ్బాయికి మంచి సంబంధాలు వస్తున్నాయి. నాకైతే చేసెయ్యాలని తొందరగా ఉంది. మీ అన్నయ్యగారేమో ఇంకా మంచి సంబంధం వస్తుందేమో ఇంకా కొంతకాలం ఆగుదాం అంటున్నారు. మీరైనా చెప్పండి" అన్నారు. దానికి మా ఆవిడ "చూడండి వదినగారూ! అబ్బాయికి మంచి చదువు, ఉద్యోగం, సంఘంలో మంచి హోదా ఉన్న తండ్రి ఉంటే మంచి సంబంధాలు రావడంలో ఆశ్చర్యం ఏముంది చెప్పండి! ఈ రోజుల్లో అమ్మాయికి మంచి భర్త దొరకడం ఎంత కష్టంగా ఉందో, అలాగే అబ్బాయికీ యోగ్యురాలయిన అమ్మాయి దొరకడం అంతే కష్టంగా వుంది. మనం ఇంకా పాతకాలం వాళ్ళమే కదా! కులం, గోత్రం, జాతకం వగైరాలు అన్నీ కలవాలి. కుటుంబం మంచిదవ్వాలి అని అన్నీ చూసుకుంటాం కదా! అవన్నీ కుదిరి అమ్మాయి నచ్చినా, ఇంకా మంచి సంబంధం వస్తుందని ఆలస్యం చేశారనుకోండి. అబ్బాయికి విసుగెత్తి ఏమైనా చేస్తే తర్వాత మనం బాధపడి ప్రయోజనం లేదు. ఇలాంటి విషయాల్లో మీరే అన్నయ్యగారికి నచ్చచెప్పాలి. మా ఆయన్నే తీసుకోండి. నాకంటే మా పక్కింటాయన భార్యే ఎప్పుడూ అందంగా వుందంటూ వుంటారు. అది మగాళ్ళ నైజం.

ఏ మగాడైనా సరే ముఖ్యమైన విషయాల్లో సరిపెట్టుకుని ఎవరో ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలి. తర్వాత అంతకంటె ముఖ్యమైనది—ఆ చేసుకున్న అమ్మాయిని ప్రేమించడం నేర్చుకోవడం.

అంతే కానీ అలా అమ్మాయిలని చూసుకుంటూపోతే అంతం ఎక్కడ చెప్పండి. ఏదో అడిగారు కాబట్టి అలవాటు కొద్దీ నిర్భయంగా సలహా ఇచ్చాను. నచ్చకపోతే తిట్టుకోకండి" అంటూ ముగించింది. నా ఎదురుగుండా కూర్చున్న మా చైర్మన్‌గారు నాకేసి తీక్షణంగా చూస్తే, ఓ క్షణం వళ్ళు జలదరించినా మా ఆవిడ తెలివితేటలకు మనసులోనే మెచ్చుకోకుండా ఉండలేకపోయాను.

తర్వాత నెల తిరక్కుండానే ఇద్దరు కొత్త మేనేజర్లు మా ప్లాంటులో చేరుతున్నారన్న శుభవార్త మా చైర్మన్‌గారి సెక్రటరీ నా చెవిలో వేశాడు.

— సూర్య

---

మేమంతా కట్టకట్టుకొని జగ్గారావు ఇంటికి వెళ్ళాము. అలా వెళ్ళటానికి చాలా కారణముంది. నేను, రాజా, తిలక్, దాస్‌గాడు మొత్తం అందరం ఒకే కాలేజి. ఒకే సెక్షన్. అంతా సీనియర్ ఇంటరే.

మేము వెళ్ళేసరికి జగ్గారావు అస్తమా వచ్చినవాడికి మల్లే అవస్థపడుతూ కనిపించాడు. నిన్నటిదాకా కూడా అతనిలో అంతులేని జీవకళ కనిపించింది. కానీ ఈరోజు వాడు వెలిసిపోయిన రంగులా వున్నాడు.

మమ్మల్ని చూడగానే వాడికి అంతులేని నీరసం అంతరాళ్లోంచి తన్నుకొచ్చినట్లుంది. పీల గొంతుతో "ఏమిటి? అంతా ఇలా నా కొంపమీదికి వచ్చిపడ్డారు" అన్నాడు.

దాస్‌గాడు ఒక్కసారిగా గొంతు చించుకొని "నీ కొంపని ఓ కొలిక్కి తెద్దామని" అంటూ అరిచేడు.

జగ్గాగాడు కళ్ళు చిట్లించుకొని "అసలే నా రోజులేం బావోలేదు. మీరేం చేసినా........" అంటూ ఏదో వాగబోయాడు.